Namasthe Telangana Dt 01/08/23






# సిటీ జోష్

సంక్షేమానికి కొత్త అర్థాన్నిస్తూ కీలక పథకాలను అమలు చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వం.. మానవీయ కోణంలో మరిన్ని కీలక నిర్ణయాలను ప్రకటించింది. సీఎం కేసీఆర్ అధ్యక్షతన సోమవారం ఆరుగంటలపాటు సుదీర్ఘంగా చర్చించిన రాష్ట్ర మంత్రివర్గం.. సబ్బండ వర్ణాలపై తన ప్రేమను, బాధ్యతను చాటుకున్నది. నిజాంకాలంలో ప్రారంభమై వందేండ్లు పూర్తిచేసుకుంటున్న ఆర్టీసీకి శతవసంతాల వేళ తీపికబురు అందించింది. సంస్థను పటిష్ఠం చేసి, మరో వందేండ్లపాటు నడిపించేలా ఆర్టీసీని ప్రభుత్వంలో అంతర్భాగం చేయాలని నిర్ణయించింది. 43 వేల పైచిలుకు కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపుతూ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నది. ఈ నిర్ణయం అమలైన వెంటనే ఆర్టీసీ కార్మికులంతా ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్నారు. పింఛన్లకు సంబంధించి మరో ఉదార నిర్ణయాన్ని కేసీఆర్ క్యాబినెట్ తీసుకున్నది. బీడీ కార్మికులకు ఇచ్చినట్టుగానే రాష్ట్రంలోని 6 వేలమంది టేకేదార్లకు కూడా రూ.2,016 చొప్పున పింఛన్ అందించాలని నిశ్చయించింది. దేశంలో ఎక్కడాలేనివిధంగా అనాథ పిల్లల కోసం ప్రత్యేకంగా పాలసీని రూపొందించాలని నిర్ణయించింది. అనాథ పిల్లలందరినీ 'చిల్డ్రన్ ఆఫ్ స్టేట్' గా గుర్తిస్తూ తీర్మానించింది. బడుగు వర్గాలకు చెందిన ఇద్దరిని శాసనమండలికి పంపాలని నిర్ణయించింది. ఎరుకల సామాజిక వర్గానికి చెందిన కుర్రా సత్యనారాయణ, బీసీల గొంతుక దాసోజు శ్రవణ్‌ను గవర్నర్ కోటాలో పెద్దలసభకు నామినేట్ చేయనున్నారు. వరద నష్టంపై విస్తృతంగా చర్చించిన క్యాబినెట్.. వర్ష బాధిత ప్రాంతాలకు రూ.500 కోట్లు తక్షణ సాయంగా ప్రకటించింది. వర్షాల కారణంగా మరణించిన వారికి నివాళులర్పించిన మంత్రివర్గం.. పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో సహాయ చర్యల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులను, ఉద్యోగులను అభినందించింది.

హైదరాబాద్ మెట్రో విస్తరణకు రూ.69,100 కోట్లతో భారీ ప్రణాళికను రాష్ట్ర మంత్రివర్గం ప్రకటించింది. దేశంలో తొలిసారి డబుల్ డెక్కర్ మెట్రో మార్గాన్ని నిర్మించనున్నట్టు ప్రకటించింది. మరో వందేండ్లల్లో నగర విస్తరణను దృష్టిలో పెట్టుకుని మెట్రోను ఔటర్ అవతలివైపు వరకూ విస్తరించాలని క్యాబినెట్ నిర్ణయించింది.

## హైదరాబాద్ నలుదిశలా మెట్రో రైల్

**43,373 మంది**
కార్మికులు ఇక ప్రభుత్వ ఉద్యోగులు

**500 కోట్ల**
తక్షణ వరద సాయం

**69,100 కోట్లతో**
భాగ్యనగర ప్రజా రవాణా భారీ విస్తరణ

- ఆర్టీసీ విలీనంపై వచ్చే అసెంబ్లీలో బిల్లు
- అనాథ పిల్లల సంరక్షణకు కొత్త పాలసీ
- బీడీ టేకేదారులకూ నెలకు 2వేల పింఛన్
- మరో 8 మెడికల్ కళాశాలల ఏర్పాటు
- మహబూబాబాద్‌లో హార్టికల్చర్ కాలేజీ
- వరంగల్‌లో ఎయిర్‌పోర్టుకు 253 ఎకరాలు
- హకీంపేట ఎయిర్‌బేస్‌లో పౌర ప్రయాణ సేవల ప్రారంభానికి కేంద్రానికి తీర్మానం
- గవర్నర్ వెనక్కి పంపిన బిల్లులు అసెంబ్లీకి..
- సౌతిండియా కాపు సమితి భవనానికి స్థలం
- నిమ్స్‌లో మరో 2వేల పడకల పెంపునకు రూ.1800 కోట్ల నిధుల కేటాయింపు
- హైదరాబాద్‌లో 4 చోట్ల హైబ్రిడ్ పద్ధతిలో సూపర్ స్పెషాలిటీ దవాఖానలకు ఆమోదం
- మున్నేరువాగు చుట్టూ రిటైనింగ్ వాల్
- రాష్ట్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు



### కేంద్రంలో వచ్చేది సంకీర్ణమే..
### బీఆర్‌ఎస్సే అందులో కీలకం

మా ఉద్దేశంలో ఈ కేంద్ర ప్రభుత్వానికి చెప్పినా.. గోడకు చెప్పినా ఒక్కటే. అయినప్పటికీ మా ప్రయత్నం మేం చేస్తాం. హస్తినకు వెళ్తాం.. నిధులు కోరుతాం. మెట్రో రైల్‌కైనా, వరద సాయమైనా! చేస్తే మంచిది. ఇవ్వకపోతే వాళ్ల ఖర్మ. కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఆశిస్తున్నాం. సహకరించకపోతే 2024లో ఏర్పడేది ఎలాగూ సంకీర్ణ ప్రభుత్వమే. అందులో బీఆర్ఎస్ కీలకపాత్ర పోషిస్తుంది. - కేటీఆర్

## మానవీయ నిర్ణయాలు

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): సంక్షేమ పాలనలో దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్న కేసీఆర్ ప్రభుత్వం తమది మానవీయ పాలన అని మరోసారి చాటుకున్నది. సబ్బండ వర్గాలపై తన ప్రేమను, బాధ్యతను చాటుకుంటూ పలు కీలక నిర్ణయాలను తీసుకున్నది.తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) ఉద్యోగులకు రాష్ట్ర సర్కారు శుభవార్త చెప్పింది. టీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ క్యాబినెట్ అత్యంత కీలక నిర్ణయం తీసుకొన్నది. సోమవారం హైదరాబాద్‌లోని అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకొన్నారు. మంత్రివర్గ సమావేశానంతరం క్యాబినెట్ నిర్ణయాలను రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కే తారకరామారావు మరికొంతమంది మంత్రులతో కలిసి మీడియాకు వివరించారు. భారీ వర్షాల నేపథ్యంలో తక్షణ వరదసాయంగా రూ.500 కోట్లు విడుదల చేయాలని క్యాబినెట్ నిర్ణయించిందని తెలిపారు. తెలంగాణకు గుండెకాయగా నిలుస్తున్న హైదరాబాద్‌లో మూడు, నాలుగేండ్లలో రూ.60 వేల కోట్లతో మెట్రోను మరింత విస్తరించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని 2వ పేజీలో

### హైదరాబాద్‌లో నలుమూలలా మెట్రోరైల్

1. రాయదుర్గం- శంషాబాద్-కందుకూరు
2. శంషాబాద్ -కొత్తూర్- షాద్‌నగర్
3. ఇస్నాపూర్-మియాపూర్- లక్డీకాపూల్
4. ఎల్బీనగర్- పెద్ద అంబర్‌పేట
5. ఉప్పల్ -బీబీనగర్
6. తార్నాక - ఈసీఐఎల్
7. ఓఆర్ఆర్ వెంబడి, సిటీ చుట్టూ..

### డబుల్‌డెక్కర్ మెట్రో

ఈ కింది రూట్లలో డబుల్ డెక్కర్ (రెండు అంతస్థుల వంతెనలు) నిర్మిస్తారు. ఒక వంతెనను మెట్రో రైలుకు, మరో వంతెనను వాహనాలకు కేటాయిస్తారు.

1. జేబీఎస్-తూముకుంట
2. ప్యాట్నీ-కండ్లకోయ